క్లుప్తంగా

ఆర్టీసీ సిబ్బంది ర్యాలీ



నెల్లూరు సిటీ: రోడ్డు భద్రత మాసోత్సవాలు, డ్రైవర్స్ డేను పురస్కరించుకొని నగరంలోని ప్రధాన బస్టాండ్ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. నెల్లూరు ఒకటో డిపో మేనేజర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన



నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ పరిధిలోని 18, 19, 20, 32, 33వ డివిజన్లలో దోమలపై దండ యాత్ర కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయా డివిజన్లలో చేపట్టిన పారిశుధ్య పనులను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు.

హెల్మెట్‌ను విధిగా ధరించాలి



అవగాహన కల్పిస్తున్న సాంబశివరావు

నెల్లూరు(క్రైమ్): ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను విధిగా ధరించాలని నగర పోలీస్ అధికారులు కోరారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీలను నవాబుపేట, బాలాజీనగర్, సౌత్, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు అన్వర్‌బాషా, సాంబశివరావు, వెంకటరెడ్డి, రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు.

శ్రీనివాస కల్యాణం నేడు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వేదాయపాళెం సమీపంలోని చంద్రమౌళీనగర్‌లో గల వేద గణపతి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నామని సింహపురి గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. పుష్ప యాగాన్ని నిర్వహించనున్నామని, సంప్రదాయ దుస్తులతో హాజరుకావాలని కోరారు.

స్టోన్‌హౌస్‌పేటలో అన్నదానం



నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేట మెయిన్ రోడ్డులోని ఎన్నెస్సార్ కాంప్లెక్స్ వద్ద నెల్లూరు డిస్ట్రిక్ట్ రైస్ కాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజా సుబ్బారావు, జిల్లా కార్యదర్శి రాజా రవి, కోశాధికారి సుదర్శన్‌రావు, ఉపాధ్యక్షుడు శేషారావు, సహాయ కార్యదర్శి సుధాకర్, కృష్ణయ్య, నాగేశ్వరరావు, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సర్టిఫికెట్ల ప్రదానం



నెల్లూరు(క్రైమ్): నగరంలో రోడ్డు భద్రత వారోత్సవాలను నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి నిర్వహించారు. వివిధ కళాశాలల విద్యార్థులు వలంటీర్లుగా ట్రాఫిక్ పోలీసులతో కలిసి ట్రాఫిక్ విధులను నిర్వర్తించడంతో పాటు నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ క్రమంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వలంటీర్లకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లను జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి, సౌత్, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరెడ్డి, రామకృష్ణ అందజేశారు.

లార్వా, ఫీవర్ సర్వే తనిఖీ



నెల్లూరు(అర్బన్): పొదలకూరు రోడ్డులోని జీవీఆర్ కాలనీలో నిర్వహిస్తున్న లార్వా, ఫీవర్ సర్వేలను జిల్లా మలేరియా సహాయాధికారి నాగార్జునరావు శుక్రవారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో చికున్ గున్యా కేసు నమోదు కావడంతో అధికారులు పర్యటించారు. పలు చోట్ల లార్వాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. మలేరియా విభాగ సిబ్బంది జయరామ్, రామారావు, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తును అందించాలి



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ



డీకేడబ్ల్యూలో..

- డీఎంహెచ్‌ఓ సుజాత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బాలికలకు బంగారు భవిష్యత్తును అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని కస్తూరిదేవి హైస్కూల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాలికలు అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణించేందుకు అవకాశాలున్నాయని చెప్పారు. అనంతరం మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ చెంచురామారావు మాట్లాడారు. బాలికల రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ అనూరాధ, కార్మిక శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఎంఈఓ జానకిరామ్, బాలల సంరక్షణాధికారి సురేష్, సమత, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సభ్యుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, న్యూరో ఫిజీషియన్ హేమలతారెడ్డి, నెరసం ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు అరుణ, నజ్మాబేగం, భారతి, అధ్యాపకులు కరుణకుమారి, పూర్ణసుధ తదితరులు పాల్గొన్నారు.

➡ కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు వివిధ పోటీలను జరిపారు. హెచ్‌ఎం భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్, కిరణ్, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(క్రైమ్): మహిళలు, బాలికల భద్రతే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోందని మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ చెంచురామారావు పేర్కొన్నారు. మహిళలు, బాలికల రక్షణ చట్టాలు, మానవ అక్రమ రవాణా, సైబర్ క్రైమ్, మత్తు, మాదకద్రవ్యాల వినియోగంతో సంభవించే దుష్పరిణామాలపై బొల్లినేని, డాక్టర్ రామచంద్రారెడ్డి, మురళీకృష్ణ నర్సింగ్ కళాశాలల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కస్తూరిదేవి బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి, ఐహెచ్‌టీయూ సిబ్బంది శ్రీహరి, సతీష్, ప్రసాద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కొండాయపాళెంలోని పాఠశాలలో..



కస్తూరిదేవి స్కూల్లో..

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో గల వాకాటి నరసయ్య త్యాగరాజ కల్యాణ మండపంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాన్ని ఆదివారం జరపనున్నామని నిర్వాహకులు అమరా మోహన్‌రావు, తన్నీరు మస్తాన్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను స్థానిక కల్యాణ మండపంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. సంగీత కళాకారులతో పంచరత్న కీర్తనలు, త్యాగరాజస్వామి కీర్తనల ఆలాపనతో ఉత్సవాన్ని జరపనున్నామని చెప్పారు. వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నామని, భారీగా తరలిరావాలని కోరారు. నిర్వాహకులు కోట సత్యనారాయణ, హనుమంతరావు, సోమిశెట్టి వెంకటరత్నం, కోట శివప్రసాద్, అప్పల సత్యనారాయణ, ఆంజనేయులు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఆమంచర్లలో 'పొలం పిలుస్తోంది'



మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు సిటీ: ఆమంచర్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు శ్రీనివాసులు, మండల వ్యవసాయాధికారి నాగమోహన్ మాట్లాడారు. అధికారుల సూచనల మేరకే పురుగు మందులను వినియోగించాలని కోరారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు శివ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా

నెల్లూరు(బారకాసు): బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నగరంలోని నాలుగో డివిజన్లో శుక్రవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. భూగర్భ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుల ద్వారా సరఫరా అవుతున్న నీటి పరిమాణాన్ని పెంచాలని చెప్పారు. నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాల్లో జంగిల్ క్లియరెన్స్ చేయించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. డివిజన్లోని ఓవర్‌హెడ్ ట్యాంక్, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. కాలువల్లో పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులను నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. పార్కుల స్థలాలను గుర్తించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, హెల్త్ ఆఫీసర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత



నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో 315 మందికి పౌష్టికాహారాన్ని అబైడింగ్ హోప్ ట్రస్ట్, పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. ట్రస్ట్ డైరెక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్, సర్వోదయ కళాశాల అధ్యాపకుడు లివింగ్‌స్టన్, జయప్రకాష్, క్రాంతి, మరియమ్మ, బాబు, సురేఖ, మహేష్, హేమేందర్, అనుష్క తదితరులు పాల్గొన్నారు.

2న బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు రూరల్: తిరుపతిలోని కంచి పాదుక మండపంలో బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక, విశేష పూజా కార్యక్రమాలను ఫిబ్రవరి రెండున నిర్వహించనున్నామని వెంకట గాయత్రి బ్రాహ్మణ వివాహ సమాచార కేంద్ర ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. స్పాట్ రిజిస్ట్రేషన్లను అదే రోజున చేయనున్నామని, అనంతరం 1500 మంది వధూవరుల వివరాలు కలిగిన పుస్తకాలను అందజేయనున్నామని చెప్పారు. శేషగిరిరావు, ప్రదీప్‌కుమార్, సుబ్రహ్మణ్యం, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా వార్షికోత్సవం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో రత్నం విద్యాసంస్థల క్రీడా వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ఏఓలు తుహీనా, వాణి, సునీల్, ఖాసిం, మేనేజర్లు రాజేష్, అజయ్‌సింగ్, అశోక్, ప్రిన్సిపల్స్ మణిమాల, శివకుమార్, ప్రపూర్ణ పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డికి నివాళులు



నెల్లూరు రూరల్: ముత్తుకూరు బస్టాండ్ సెంటర్‌లో దివంగత రామకృష్ణారెడ్డికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. బీజేపీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, ఆటో యూనియన్ అధ్యక్షుడు బాలకృష్ణ, ముసునూరు సుబ్బారావు, పార్టీ నేతలు కందికట్ల రాజేశ్వరి, సురేంద్రరెడ్డి, ఆంజనేయరెడ్డి, నరసింహనాయుడు, పెంచలయ్య, యశ్వంత్‌సింగ్, చిలకా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మానవహారం నేడు

నెల్లూరు(అర్బన్): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ కలెక్టరేట్ ఆవరణలో మానవహారాన్ని శనివారం ఉదయం నిర్వహించనున్నామని డీఆర్వో ఉదయభాస్కర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం తిక్కన ప్రాంగణంలో జాతీయ ఓటర్ల దినోత్సవ సభను నిర్వహించనున్నామని వివరించారు.

కార్యక్రమ విజయవంతానికి పిలుపు

నెల్లూరు రూరల్: జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ కోరారు. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. నేతలు లెక్కల రాజశేఖర్, హర్షవర్ధన్, కోసూరు సుధీర్, సన్నారెడ్డి సాయికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనధికార మద్యం విక్రేత అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): అనధికార మద్యం విక్రయాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు – 1 అధికారులు దాడులను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని పొర్లుకట్ట సమీపంలో అనధికారికంగా మద్యాన్ని విక్రయిస్తున్న శేషమ్మను శుక్రవారం అరెస్ట్ చేశారు. ఆమె నుంచి 13 క్వార్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని వినతి

నెల్లూరు రూరల్: అవుట్ సోర్సింగ్ విధానాన్ని తీసుకొచ్చి ప్రాజెక్టులను నిర్వీర్యం చేస్తున్నారని బీజేపీ నేత మిడతల రమేష్ ఆరోపించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఖాళీగా ఉన్న లష్కర్ల పోస్టుల్లో కండలేరు నిరుద్యోగులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ తెలుగుగంగ ఎస్‌ఈ రాధాకృష్ణారెడ్డికి వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. నరాల సుబ్బారెడ్డి, సుబ్బయ్య, నీలిశెట్టి లక్ష్మణరావు, మునిసురేష్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన డీఎస్పీ

నెల్లూరు(బారకాసు): కమిషనర్ సూర్యతేజను నగరపాలక సంస్థ కార్యాలయంలో నగర డీఎస్పీ సింధుప్రియ మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు.

మార్చి 19, 20న 'డీకేడబ్ల్యూ' వజ్రోత్సవాలు

నెల్లూరు రూరల్: డీకేడబ్ల్యూ కళాశాలలో వజ్రోత్సవాలను మార్చి 19, 20న నిర్వహించేందుకు పూర్వ విద్యార్థుల సంఘం, కళాశాల కమిటీ నిర్ణయించాయని ప్రిన్సిపల్ గిరి పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 60 ఏళ్లు నిండిన పూర్వ విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని సత్కరించనున్నారని చెప్పారు. వివరాలకు 93987 79966, 99494 05595 నంబర్లను సంప్రదించాలని సూచించారు. పూర్వ విద్యార్థుల సంఘ ప్రెసిడెంట్ జ్యోతిరెడ్డి, సెక్రటరి కుసుమ, ట్రెజరర్ జానకి, వైస్ ప్రెసిడెంట్ జక్కా శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాయిహృదయ వార్షికోత్సవం రేపు

నెల్లూరు(బారకాసు): గోమతినగర్‌లోని సాయిహృదయ మందిర వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నామని మందిర కన్వీనర్ కొండా శేషగిరిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, సత్సంగం, వేదపఠనం, సత్యసాయి చాలీసా తదితరాలను నిర్వహించనున్నామని చెప్పారు. భక్తులు తరలిరావాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరపురం మెయిన్ రోడ్డులో రోడ్డు విస్తరణ పనులను చేపట్టనున్న క్రమంలో ఆయా ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. రామ్మూర్తినగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా రామలింగాపురం, రామ్మూర్తినగర్, గచ్చుకాలువ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

➡ కోటమిట్ట సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న క్రమంలో జెండా వీధి, కోటమిట్ట, గిడ్డంగివీధి, వీబీఎస్ కల్యాణ మండపం తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

➡ డైకస్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని ఫతేఖాన్‌పేట ఫీడర్‌లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న తరుణంలో ఫతేఖాన్‌పేట, రైతుబజార్ తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని వివరించారు.

డయల్ యువర్ డీఎం - 2

నెల్లూరు సిటీ: నగరంలోని ఆర్టీసీ కార్యాలయంలో డయల్ యువర్ డీఎం – 2 కార్యక్రమాన్ని మేనేజర్ శివకేశవ్‌యాదవ్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ముగ్గురు ఫోన్ చేశారు. నగరంలో సిటీ బస్సులను ఏర్పాటు చేయాలని సాగర్.. పామూరు నుంచి చెన్నై, తిరుపతికి ఎక్స్‌ప్రెస్ బస్సులను నడపాలని పామూరుకు చెందిన నరసింహ.. నారాయణ హాస్పిటల్‌కు బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేయాలని కొత్తూరుకు చెందిన కరిముల్లా కోరారు. నగరంలో సిటీ బస్సుల విషయమై ప్రతిపాదనలు పంపామని, పరిశీలనలో ఉందని, సాధ్యాసాధ్యాలను బట్టి ఏర్పాటు చేస్తామని డిపో మేనేజర్ తెలిపారు.

దుకాణాల ఏర్పాటుతో ఇబ్బంది



కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని జాఫర్‌సాహెబ్ కాలువ వద్ద దుకాణాలను ఏర్పాటు చేస్తే పలు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని, గత ప్రతిపాదనలకు అనుగుణంగా గ్రీనరీ, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టరేట్లో కలెక్టర్ ఆనంద్‌కు పలువురు నేతలతో కలిసి వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, జిల్లా అధికార ప్రతినిధి నేతాజీ సుబ్బారెడ్డి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సిద్ధిక్, కార్పొరేటర్ కరిముల్లా, ఏఎంసీ మాజీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి, కార్పొరేటర్లు వేలూరు ఉమామహేష్, ఊటుకూరు నాగార్జున, విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్సీడీ సర్వే



మాట్లాడుతున్న శ్యామల

నెల్లూరు(అర్బన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్సీడీ 3.0 సర్వేను జిల్లాలో పక్కాగా చేపట్టాలని రాష్ట్ర ఎన్సీడీసీడీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్యామల కోరారు. నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల డాక్టర్లతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. షుగర్, బీపీ లాంటి కేసుల వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలని సూచించారు. కేన్సర్, మానసిక సమస్యలనూ ఎన్సీడీలో ప్రభుత్వం చేర్చిందని తెలిపారు. కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను క్షేత్రస్థాయిలో మరింత జాగ్రత్తగా చేపట్టాలని కోరారు. అనుమానిత కేసులను పింక్ కార్డుల్లో నమోదు చేసి రెఫరల్ ఆస్పత్రులకు పంపాలన్నారు. డీఎంహెచ్‌ఓ సుజాత, ఎన్సీడీసీడీ రాష్ట్ర కన్సల్టెంట్ రాజ్‌కుమార్, డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ సురేష్, జిల్లా ప్రోగ్రామ్ అధికారి వాసవి, ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



వెంకటరవికుమార్‌కు సన్మానం

నెల్లూరు(బృందావనం): శుభమస్తు షాపింగ్ మాల్, న్యూ రాజ్యలక్ష్మి హాల్ వ్యవస్థాపకుడు బయ్యా వెంకటరమణయ్య పదో వర్ధంతిని పురస్కరించుకొని శుభమస్తు షాపింగ్‌మాల్స్ ఏడు బ్రాంచిల్లో మెగా రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. దాదాపు 500 మంది రక్తదానం చేశారు. అధినేతలు బయ్యా శ్రీనివాసులు, బయ్యా వెంకటరవికుమార్, కుటుంబసభ్యులు, లయన్స్ క్లబ్ మెంబర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శేషాద్రి సుధీర్, మెంటా శరత్‌బాబు, కోశాధికారి మోహన్‌కృష్ణ, పార్థసారథి మేనేజర్ సుబ్బారావు పాల్గొన్నారు.

కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ ఆధ్వర్యంలో..

నెల్లూరు(అర్బన్): గాంధీబొమ్మ సమీపంలోని నోవా బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆలిండియా కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ వార్షికోత్సవం, అసోసియేషన్ అధ్య క్షుడు షిండే జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పేరూరి ప్రదీప్, సెక్రటరీ వెంకటేశ్వర్లు, కోశాధికారి నరేంద్రబాబు, జిల్లా నేతలు దుగ్గిపాటి అశోక్, ప్రసాద్, అనిల్, కిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



నెల్లూరు(బారకాసు): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నగరంలోని మోడల్ స్కూల్ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కమిషనర్ సూర్యతేజ శుక్రవారం అభినందించారు. వీరికి రూ.ఐదు వేలు, రూ.నాలుగు వేలు, రూ.మూడు వేలను అందజేశారు. ఏఈఆర్వో షఫీమాలిక్, ఎంఈఓ తిరుపాల్, ఈడీటీ ఆనందరావు, ప్రధానోపాధ్యాయుడు చక్రపాణి పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి

నెల్లూరు(బారకాసు): ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. నగరంలోని ఆచారివీధి, మురళీకృష్ణ హోటల్, డీఆర్ ఉత్తమ హోటల్ వీధి, ఏసీ కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. వాహనాల పార్కింగ్‌తో కూడలిలో ట్రాఫిక్ స్తంభిస్తుండటాన్ని ఆయన గమనించారు. దీనిపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం మార్కెట్ ప్రాంగణంలోని అన్న క్యాంటిన్‌ను సందర్శించారు. ఎంహెచ్‌ఓ చైతన్య, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్ ప్రయోజనాలను తెలియజేయాలి

నెల్లూరు(బారకాసు): సూర్యఘర్ పథక ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. సోలార్ విద్యుత్‌పై జిల్లా విద్యుత్ అధికారులతో సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కస్తూర్బా కళాక్షేత్రంలో సోలార్ ఎక్స్‌పోను త్వరలో నిర్వహించనున్నామని వివరించారు. అనంతరం పొదలకూరు రోడ్డులో సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకున్న వినియోగదారుడి ఇంటికెళ్లి ఎలాంటి లాభాలు కలుగుతున్నాయో తెలుసుకున్నారు. ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ విజయన్, ఈఈ శ్రీధర్, డీఈఈలు అశోక్, సునీల్, కిరణ్‌కుమార్, నగరపాలక సంస్థ ఎస్‌ఈ రామ్మోహనరావు పాల్గొన్నారు.

నగరానికి చేరిన గోరక్ష పాదయాత్ర



నెల్లూరు(బృందావనం): దేశంలో గోవుల సంతతిని రక్షించి.. వ్యవసాయాధారిత భూమిని సంరక్షించాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన బాలకృష్ణ గురుస్వామి కశ్మీర్ నుంచి కన్యాకుమారికి చేపట్టిన గోరక్ష మహా పాదయాత్ర నగరంలోని లస్సీ సెంటర్‌కు శుక్రవారం చేరింది. యాత్రకు అఖిల భారత పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, కార్యనిర్వాహక అధ్యక్షుడు సోమా గోపాల్ తదితరులు స్వాగతం పలికారు. న్యాయవాది రంగరాజన్, నెల్లూరు వెంకటేశ్వర్లు, రాజ్‌కపూర్ పురోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవచనాలు ప్రారంభం



రాజశేఖర్ దంపతులకు సత్కారం

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో రామాయణ ప్రవచనాలను పద్యసారస్వత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. అనంతరం అవధాని కోట రాజశేఖర్ దంపతులను సత్కరించారు. మందిర కమిటీ అధ్యక్షుడు తన్నీరు మస్తాన్‌రావు, పద్యసారస్వత పరిషత్ అధ్యక్షుడు పోలవరపు లక్ష్మీనరసింహారావు, చీమకుర్తి వెంకటేశ్వరరావు, సత్యానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరితీర్థ, సింహపురి ధార్మిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, నలుబోలు బలరామయ్యానాయుడు, మెట్టు రామచంద్రప్రసాద్, మురారిశెట్టి తిరుపతి, సంస్థ కోశాధికారి సూరం చంద్రశేఖర్, శతావధాని మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దీప్తి నర్సింగ్ హోమ్‌లో అరుదైన ఆపరేషన్



నెల్లూరు(అర్బన్): బృందావనంలోని తమ ఆస్పత్రిలో ఓ మహిళకు అరుదైన ఆపరేషన్ చేసి గాల్‌బ్లాడర్‌లో ఉన్న 500కుపైగా రాళ్లను తొలగించామని దీప్తి నర్సింగ్ హోమ్ సర్జన్ లోకనాథం పేర్కొన్నారు. ఈ మేరకు బాధితురాలితో కలిసి విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. తోటపల్లిగూడూరు మండలం పోట్లపూడికి చెందిన 45 ఏళ్ల కామేశ్వరి రెండేళ్లుగా పొట్ట నొప్పితో బాధపడుతున్నారని చెప్పారు. స్థానికంగా ఉండే పలువురు వైద్యులను సంప్రదించగా, గ్యాస్ట్రిక్ ట్రబుల్‌గా అనుమానించి మందులను సిఫార్సు చేసేవారని తెలిపారు. తీవ్రమైన నొప్పి రావడంతో భరించలేక తమ ఆస్పత్రికి వచ్చారని, 108 కిలోల బరువుతో ఊబకాయంతో ఉన్నారని తెలిపారు. స్కానింగ్ చేయగా, రాళ్లతో నిండిన గాల్‌బ్లాడర్ 20 సెంటీమీటర్ల వరకు సాగిపోయి ఉందనే అంశాన్ని గుర్తించామన్నారు. ఈ స్థితిలో తాము ల్యాప్రోస్కోపిక్ ఆపరేషన్ చేసి, గాల్‌బ్లాడర్‌లోని 500కుపైగా రాళ్లను తొలగించామని తెలిపారు. బాధితురాలు ప్రస్తుతం కోలుకుంటున్నారని వివరించారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో రాహుకాల పూజలు తదితరాలను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. వేదపారాయణం, కుంభహారతులు, పల్లకి సేవను జరిపారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, దేవస్థాన ప్రధానార్చకుడు రఘురామశర్మ తదితరులు పర్యవేక్షించారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం



నెల్లూరు(అర్బన్): దోమలను నివారించడం ద్వారా మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికున్‌గున్యా లాంటి వ్యాధులను దూరం చేయొచ్చని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. కోటమిట్ట అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని మన్సూర్‌నగర్, కోటమిట్ట, జెండావీధి తదితర ప్రాంతాల్లో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. యూపీహెచ్‌సీ కో ఆర్డినేటర్ తిరుపతయ్య, సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్‌ఎంలు రమ్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.